క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీటీ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని అంతారం, అంతారంతండా, ఓగిపూర్, కరన్ కోట్‌తో పాటు పలు గ్రామాల్లో ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శాంతు, ఉప సర్పంచు జీవరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

దోమ: గ్రామాల్లోని ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలించొద్దని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గుండాలలో ఆర్‌ఐ లింగం, ఎస్‌ఐ రవి గౌడ్‌లు గ్రామస్తులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో భూ వివాదాలు ఉంటే చట్టాలు ఉన్నాయని, చట్టాల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అవసరం లేని కారణాలతో గొడవలు సృష్టించుకొని ఇబ్బందులు పడొద్దన్నారు. గ్రామంలో ఇటీవలే 204 సర్వే నంబర్‌లోని భూమి వివాదంలో గొడవలు జరిగిన విషయం విదితమే. ఆ భూమి కోర్టు పరిధిలో ఉందని, వాటి దగ్గరికి ఏ కుటుంబాలు వెళ్లకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. గ్రామంలో ఎవైనా సమస్య తలెత్తితే పోలీసులను ఆశ్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ బసయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంటావార్పు



సమ్మెలో పాల్గొన్న ఏఎన్ఎంలు

బొంరాస్‌పేట: కాంటాక్టు పద్ధతిన ఆరోగ్య వైద్య సేవలు అందిస్తున్న ఎంపీహెచ్ఎస్(ఏఎన్ఎం)లు క్విట్ ఇండియా స్ఫూర్తితో వంటావార్పు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు లీలావతి, హైమావతి మాట్లాడుతూ.. వేతనాలకు మించి సేవలు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఉద్యోగాలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎంలను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలన్నారు. పరీక్షలు లేకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలు సుజాత, పద్మ తదితరులున్నారు.

విజయలక్ష్మికి సన్మానం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న సంతోష్‌కుమార్

తాండూరు టౌన్ : భర్త జ్ఞాపకార్థం మొక్కను పెంచుతూ పర్యావరణ స్ఫూర్తిని పెంపొందిస్తున్న తాండూరు పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మిని ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ అభినందించారు. భర్త జ్ఞాపకార్థం పది మందికి నీడ నిచ్చే చెట్టును పెంచుతూ, దానికి జన్మదిన వేడుకలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన విజయలక్ష్మిని, బుధవారం ఎంపీ ఫోన్ చేసి ప్రగతి భవన్‌కు ఆహ్వానించారు. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు బాటలు వేస్తున్న మీకు తన వంత సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం ఆమెకు మొక్కను అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, సిద్ధిలింగం, సామాజిక కార్యకర్త వెంకట్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

అనంతగిరి: జిల్లా యువ ఉత్సవాల్లో వికారాబాద్ సంగం లక్ష్మీబాయి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆయా విభాగాల్లో పాల్గొన్న విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఉపన్యాసం, సంప్రదాయ నృత్యం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను అభినందించారు.

‘గృహలక్ష్మి’ కష్టాలు!

ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన వారు ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం డెడ్ లైన్ విధించింది. దీంతో అర్హులు దరఖాస్తు ఫారాలతో పాటు ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, ఆహార భద్రతా కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలు జత చేయాల్సి ఉంటుంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, మీ సేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు.



దౌల్తాబాద్: దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు



తాండూరు రూరల్: మీ సేవా కేంద్రం వద్ద సర్టిఫికెట్ల కోసం బారులు తీరిన ప్రజలు

- 12తో ముగియనున్న గడువు
- కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం బారులు
- మొరాయించిన సర్వర్లు
- ఆందోళనలో మహిళలు



దోమ: మీసేవ కేంద్రాల్లో బారులు తీరిన జనం



వికారాబాద్ అర్బన్: దరఖాస్తు ఇస్తున మహిళలు



కొడంగల్ రూరల్: మీ సేవా కేంద్రం వద్ద రద్దీ

దోమ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు నేటితో ముగియనుంది. వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండడంతో మీసేవ, రెవెన్యూ కార్యాలయాల్లో సర్వర్ డౌన్ సమస్య ఏర్పడింది. దీంతో గ్రామీణ మహిళలు మీసేవ, రెవెన్యూ కార్యాలయాల వద్దే నిరీక్షించాల్సిన పరిస్థితి.నేడు చివరి తేది కావడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు..

పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా మూడు వేల ఇళ్లు చొప్పన గృహలక్ష్మి పథకాన్ని మంజూరు చేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న ఒక్కరికి ప్రభుత్వం మూడు లక్షలు అందించనుంది. గడువు తేది కావడంతో ధ్రువీకరణ పత్రాలు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కావల్సిన ధ్రువపత్రాలు..

గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకునే మహిళలు సొంతిల్లు లేనివారై ఉండాలి. స్థలం కలిగి ఉండాలి. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, ఓటర్ ఐడీ కార్డు, కులధ్రువీకరణ పత్రాలు, రెండు ఫొటోలతో ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి.

గడువు తక్కువ.. గడబిడి ఎక్కువ

పెద్దేముల్: మొన్న కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం.. నేడు గృహలక్ష్మి.. ప్రజలు కుల ధ్రువీకరణ పత్రాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేయడానికి రెండు రోజుల గడువు ఇవ్వడంతో బుధవారం ఉదయం 10గంటలకే ప్రజలు కార్యాలయాలకు బారులు తీరారు. సమయానికి సర్వర్ పనిచేయక రెవెన్యూ సిబ్బంది కష్టపడుతున్నారు. ఎలాగైనా, 24 గంటల్లో కుల ధ్రువీకరణ పత్రాలు అందచేస్తామని డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ రాజిరెడ్డిలు చెబుతున్నారు. గృహలక్ష్మి పథకానికి వారం రోజుల గడువు పెంచాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తుల వెల్లువ

కొడంగల్ రూరల్: మండలంలోని గ్రామాల నుంచి కొడంగల్ పట్టణానికి గృహలక్ష్మి దరఖాస్తుదారులు క్యూ కట్టారు. బుధవారం మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లు, హోటళ్లలు కిక్కిరిసిపోయాయి. ఎక్కడ చూసినా దరఖాస్తులు నింపుతూ కనిపించారు. మహిళల పేరుపై దరఖాస్తు చేసుకోవాలనే నియమాలు ఉండడంతో బ్యాంకు ఖాతాలు లేని వారు బ్యాంకుల వద్దకు రావడంతో రద్దీ ఏర్పడింది.

గృహలక్ష్మికి గడువు పెంచాలి

తాండూరు రూరల్: ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి గడువు పెంచాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాతుల వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తులకు 15 రోజుల సమయం ఇస్తోందన్నారు. కానీ, పేదల ఇళ్లు కట్టుకునేందుకు మాత్రం కేవలం మూడు రోజుల సమయం ఏంటని ప్రశ్నించారు.

12తో ముగియనున్న గడువు

తాండూరు రూరల్: గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు 12వ తేదీన ముగియనుంది. గడువు పొడగిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. మొదటి విడతల్లో భాగంగా నియోజకవర్గానికి 3 వేలు ఇల్లు మంజూరు చేస్తామని చెబుతున్నారు. దరఖాస్తుకు మాత్రం కేవలం ఐదు రోజుల సమయం ఇవ్వడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కులం,ఆదాయం సర్టిఫికెట్ల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. మీ సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు.

ఐదు రోజులతో ఇబ్బందులు

పరిగి: గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు రెండు రోజులు ఇవ్వడం సరికాదని వెంటనే గడువు పెంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో గడువు పెంచాలని డిప్యూటీ తహసీల్దార్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూంలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నియోజకవర్గంలో ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలతో ఇబ్బందులు

బంట్వారం: గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల చివరి వరకు పెంచాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం మూడు రోజులు ఇవ్వడం చూస్తుంటే ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. మహిళల పేరిట దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా 95 శాతం మందికి కులం, ఆదాయం సర్టిఫికెట్లు లేవని ఆరోపించారు. గృహలక్ష్మి పథకం అమలుపై ప్రభుత్వానికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

భారీగా దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గృహలక్ష్మి పథకానికి బుధవారం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు గురువారం చివరిరోజు కావడంతో దరఖాస్తు చేసుకునేందుకు పట్టణ ప్రజలు తరలివచ్చారు. ఒక రోజే 550 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి

తాండూరు టౌన్ : గృహలక్ష్మి పథకం దరఖాస్తు తేదీని పొడిగించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆదాయం, కులం తదితర ధృవపత్రాలు తీసుకునేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. అలాగే, సిమెంట్, ఐరన్ తదితర గృహ నిర్మాణ వస్తువుల రేట్లు విపరీతంగా పెరిగాయని, అందుకు అనుగుణంగా రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

బారులు తీరారు

దౌల్తాబాద్: గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకోవడానికి మహిళలు కార్యాలయాలకు బారులు తీరారు. గడువు 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకే ఉండడంతో మహిళలు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు నింపుతూ కౌంటర్‌లో క్యూకట్టారు.

దరఖాస్తు గడువు పెంచాలి



కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదు. ఇంటి స్థలాలు ఏళ్ల కాలం నాటివి. వాటి స్థలంలో ఇళ్లు కట్టుకోవాలంటే స్థలం పత్రాలు కావాలంటున్నారు. తమ ఇబ్బందులు గుర్తించి గడువు పెంచాలి.

–యాదమ్మ, గొడుగోనిపల్లి

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగి: అభ్యర్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 10 మంది ఎస్సై ఉద్యోగానికి ఎంపిక కావడంతో బుధవారం ఎమ్మెల్యే నివాసంలో వారికి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడు లేని విధంగా ఒకేసారి పది మంది ఉద్యోగాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మన నియోజకవర్గ పేరు ప్రతిష్ఠలు జిల్లా వ్యాప్తంగా విస్తరించాయన్నారు. చదువుతోనే సమాజంలో విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీలు అరవింద్‌రావు, సత్యహరిశ్చందర్, జెడ్పీటీసీ హరిప్రియ, నాగిరెడ్డి, రాందాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదు

మోమిన్‌పేట: ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం సీఐ సర్కిల్ పరిధిలో సివిల్ ఎస్ఐలుగా ఎంపికైన ఆరుగురు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచే ఎదైనా సాధించాలనే తపన పట్టుదల ఉండాలన్నారు. పోలీసు వృత్తిలోకి వస్తున్నా మీరు చట్టాన్ని గౌరవించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా చదివి వారు చెప్పే మాటలు ఓపికతో వినాలని సూచించారు. మోమిన్‌పేట మండలం మొరంగపల్లికి చెందిన చెన్నారెడ్డి, అంరాదికలాన్ చెందిన మీనాక్షి, ఎల్లకొండకు చెందిన రామకృష్ణ, మర్పల్లి మండలం వీర్లపల్లికి చెందిన శివవర్ధన్‌రెడ్డి, సీఐ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సుజిత్‌కుమార్‌లను ఆయన శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, విఠల్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అమ్మానాన్నల కల సాకారం

బొంరాస్‌పేట: కష్టపడి చదివించిన తల్లిదండ్రుల కలను ఎస్ఐ ఉద్యోగం సాధించి అంబుదాస్ సాకారం చేశాడు. దుద్యాల మండలానికి చెందిన అంబుదాస్‌ను గ్రామస్తులు అభినందించారు. బుధవారం అంబుదాస్, తల్లిదండ్రులు జగ్గమ్మ, లక్ష్మయ్యలను గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సత్కారించారు. కొత్తగా మండలం ఏర్పడిన తర్వాత దుద్యాల నుంచి మొదటి ఎస్సై కావడం సంతోషం వ్యక్తం చేశారు.

నిరుపేదలకు అండగా కేఎస్‌ఆర్ ట్రస్ట్



ఆర్థిక సహాయం అందజేస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

కుల్కచర్ల: నిరుపేదలకు కేఎస్‌ఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకులు శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో జిల్లెల శ్రీనివాస్ గత కొన్నిరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైయ్యాడు. విషయం తెలుసుకున్న కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి బుధవారం బాధితుడిని పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద ప్రజల కోసం తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. రాజకీయాలకు అతీతంగా తమ సేవాకార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో శేరిరాంరెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, మణికంఠ, విజయ్, నర్సింలు, ఆనంద్, వెంకటయ్య, కృష్ణ, వీరాపూర్ నర్సింలు, గణేష్ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లను పెంచండి



వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

తాండూరు టౌన్: పట్టణంలో ఆధార్ సెంటర్లను పెంచాలని బుధవారం పలువురు బీఎస్పీ నాయకులు మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. పలు సంక్షేమ పథకాల దరఖాస్తుతో పాటు, ఓటర్ ఐడి కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయడం వంటి అంశాలకు ఆధార్‌కార్డు తప్పనిసరి అయిందన్నారు. అయితే, పట్టణంలో ఒకే ఒక ఆధార్ సెంటర్ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జి సత్యమూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌రాజ్, రమేష్, జైరామ్, ముత్యాలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యత

ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రితిక్‌రెడ్డి



యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి: యువతకు ప్రాధాన్యత ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ అని యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రితిక్‌రెడ్డి అన్నారు. బుధవారం యువజన కాంగ్రెస్ పార్టీ 632వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాల్లో యువత పాత్ర కీలకమన్నారు. కాంగ్రెస్ పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి యువజన కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు జగన్ ,రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆరిఫ్, అఖిల్, ఎజాస్, మహిపాల్ పాల్గొన్నారు.

అమ్మఒడితో గర్భిణులకు మెరుగైన సేవలు



వాహనానికి పూజలు చేస్తున్న వైద్య బృందం

కుల్కచర్ల: అమ్మఒడి పథకంతో నిరుపేదలకు సాకర్యవంతమైన సేవలు అందుతున్నాయని కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు మాధురి అన్నారు. ప్రభుత్వం అందించిన అమ్మఒడి102 వాహనానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రసవం అయిన మహిళలను వారి ఇంటి వద్దకు పంపించేందుకు అమ్మఒడి 102 వాహనాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే, గర్భిణులను నెలవారి వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సి బ్బంది మల్లేష్, నవీన్, రఫీ, ప్రభాకర్, వెంకన్న, ప్ర శాంత్, ఫాతీమ, జవహర్, వినోద్, నర్సింలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనపై పునరాలోచించాలి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని వినాయక చౌరస్తాలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు అధికారులు పునరాలోచించాలని ఎంఐఎం నేత ఎస్.బి.గుల్షన్ అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌కు ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అలాగే, వినాయక ఉత్సవాల్లో విగ్రహం ఏర్పాటు చేయడంతో ఈద్గాకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఏ.షాకీర్, ఎండీ.హమీద్, ఎండీ.గౌస్, షేక్ రోమన్, ఎండీ.బా బా, ఎండీ.రసూల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దేశం కన్నా ఏదీ ఎక్కువ కాదు

బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు హన్మంతు ముదిరాజ్



యాలాల: మాజీ సైనికుడిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

యాలాల: దేశం కన్న మనకు ఎక్కువ ఏదీ కాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోలుకుంది హన్మంతు ముదిరాజ్ అన్నారు. బుధవారం ‘మేరా మట్టి..మేరా దేశ్’ కార్యక్రమంలో భాగంగా సంగెం కుర్దు గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ సైనికుడు గాండ్ల వీరప్పను ఘనంగా సన్మానించారు. దేశభద్రతలో రాత్రనక, పగలనక కాపాలకాసే సైనికులను దేశపౌరులుగా మనం గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్యానాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగం యాదగిరి, బీజేవైఎం జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జి రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

రైతుల సమస్య పరిష్కరించండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే, రైతులు

నవాబుపేట: మండల పరిధిలోని ఎక్ మామిడి, మమ్మదన్ పల్లి, కుమ్మరిగూడెం మాదారం, కేశవపల్లి తండాలకు చెందిన 450 మంది రైతులు గత 40 సంవత్సరాల నుంచి 650 ఎకరాల ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు. వారివారి హద్దుల ప్రకారం వెంటనే పట్టా పాసు పుస్తకాలు జారీ చేయాలని రైతులతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. వాస్తవ పరిస్థితులు తెలుసుకొని సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ నారాయణను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎండీ రఫీ, పద్మ, బీఆర్ఎస్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, మణెయ్య, దేవయ్య పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

కాంగ్రెస్ నేత సుధాకర్ రెడ్డి

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ కార్మికులు, ఆశవర్కర్లకు పనికి తగిన వేతనం ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశవర్కర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 48 గంటల తలపెట్టిన రిలే నిరహార దీక్షకు బుధవారం ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకొని కార్మికులు, ఆశవర్కర్లకు న్యాయం చేయాలన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితి మున్సిపల్ కార్మికులు, ఆశవర్కర్లు, హెల్త్ వర్కర్స్ చేసిన సేవ మరువలేనిదన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం పర్మినెంట్ చేయడంలో కాలయాపన చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు రత్నారెడ్డి, అనంత్ రెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఆగిపోయిన పారిశుద్ధ్య పనులు



సమ్మెలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

వికారాబాద్ అర్బన్: 48 గంటల పాటు మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మెతో పట్టణంలో రెండు రోజులుగా పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. 65 మంది పారిశుద్ధ్య కార్మికులు, 35 మంది ఇతర విభాగాల్లో పనిచేసే వారు బుధవారం, గురువారం సమ్మెలో పాల్గొననున్నారు. ఇంటి పన్ను, నల్లా బిల్లుల వసూళ్లు ఆగిపోయాయి. తమతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటుందని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గుర్తించాలనే డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు.

విద్యార్థి ఫొటోలతో నోటుపుస్తకాలు

బీసీ గురుకుల సిబ్బంది, గ్రామస్తుల హర్షం



విద్యార్థులకు అందించనున్న నోటు పుస్తకాలు

కొడంగల్ రూరల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికిరణ్ షాట్‌పుట్ విభాగంలో ఎన్నో బంగారు పతకాలు సాధించాడు. సాయికిరణ్‌ను ప్రోత్సహించాలని, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలనే ఉద్దేశంతో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థి సాయికిరణ్ గోల్డ్ మెడల్స్ అందుకున్న ఫొటోలతో నోటుపుస్తకాలు ప్రింట్ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సాయికిరణ్ తల్లిదండ్రులు సురేష్‌కుమార్, శోభారాణి, బీసీ గురుకుల సిబ్బంది, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా చిన్న పీర్ల పండుగ



పులి వేషధారణలో యువకుల నృత్యాలు

ధారూరు: మండలంలోని మోమిన్‌కలాన్‌లో బుధవారం చిన్నపీర్ల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. పీర్ల ఊరేగింపులో యువకులు పులి వేషధారణ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. పీర్లను వీధుల్లో ఊరేగించి అలావ్ ఆడుతూ, పాడుతూ ముందుగా సాగారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు, రాజుగుప్తా, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.